ఓ కొద్దిక్షణాల నిద్ర ఖరీదు పదివేలు. మరో చిన్నపొరపాటు

# తెలివితేటల విలువ



కొందరు తెలివిగలవాళ్ళని చూస్తే తెలివిలేనివాళ్ళకి వళ్ళు మంట! కొంతమంది తెలివిగలవాళ్ళకి ఒక్కోసారి ఎదురు చూడని చిక్కులూ, చీకాకులు తటస్థపడుతుంటాయి. అలాంటప్పుడు తెలివిలేనివాళ్ళుగా వ్యవహరించబడేవాళ్ళు భలే సంతోషపడి పోతుంటారు.

తెలివిలేనివాళ్ళు అని ఎలా చెప్పగలం! అని కొందరికి సందేహం కలగవచ్చు! అలాంటప్పుడు ఒకే ఒక గుర్తు! తెలివిగలవాళ్ళుగా పేరు ప్రఖ్యాతులు గడించిన ఎవరైనా ఏదో ఒక ఫైవ్‌లో బిజినెస్‌లోనో, ఎందులోనో పొరపాటున దెబ్బతిన్నారంటే తెలివిలేనివాళ్ళుగా చెప్పుకోబడేవాళ్ళు బ్రహ్మానందపడిపోతూ కసితీరా పకపకా గట్టిగా నవ్వి కడుపులోవున్న అక్కసు వెళ్ళగక్కేస్తుంటారు.

మా వారికి రావుగారనే చిన్ననాటి ఫ్రెండున్నాడు. రావుగారు చాలా తెలివైనవాడూ, బిజినెస్ బాగా తెలిసినవాడు. రావుగారు తమ మొదట్లో ఉద్యోగం చేస్తున్న కంపెనీనే కొనేశాడు తన తెలివితేటల్తో!

తనకున్న తెలివి తేటలు ఎప్పుడూ బిజినెస్‌లో దెబ్బతింటున్న మావారికి లేవని "నువ్వు ఒట్టిఫూల్‌విరా!" అంటూ చివాట్లు పెడుతుంటాడు! "పోరా ఫూల్. నీ అతి ఆశ నాకు లేదు" అని పైకి మావారు అన్నప్పటికీ బిజినెస్‌లో రావుగారు తెలివైనవాడనే జలసీ, ఉక్రోషం ఒక్కంత మావారికి ఏ మూలో వుందని నాకు తెలుసు. అయినా ఆ ఇద్దరు చిన్ననాటి స్నేహితులూ ఒకళ్ళనొకళ్ళు 'ఫూల్' అంటే 'ఫూల్' అనుకొంటూంటే యిద్దరి 'ఫూల్స్' మధ్య నేనెందుకు 'ఇంటర్‌ఫేర్' కావడం అని వింటూ వూరుకొనేదాన్ని.

రావుగారు మంచి తెలివైనవాడు మాత్రమే గాదు బాగా బ్రతకనేర్చినవాడు గూడా! అది మా

ఖరీదు యాభైవేలు. ఒకర్నొకరు ఫూల్ అనుకుంటూరా ఇద్దరూ.

వారికి మరొక చిరాకు! తన డబ్బు నయాపైసా గూడా ఖర్చు పెట్టడు! ఇతర్లు సిగరెట్ ఆఫర్ చేస్తే తాగుతాడు!... డ్రింక్ కూడా అంతే!... తానుగా డబ్బిచ్చి కొనడు! మా వారు చాలా మొహమాటం మనిషి! డబ్బు విషయంలో లెక్క చూట్టం అలవాటు లేదు! అందుకే బిజినెస్‌లో మావారికి బుర్ర లేదని రావుగారి అభిప్రాయం! అంతేగాదు తాను చాలా చాలా తెలివైనవాడననే అహంభావంగూడా జాస్తి రావుగారికి!... కాని భగవంతుడు ఇలాంటి తెలివైన వాళ్ళకు పక్కనే రిపేరు చేయలేని ఒక లోపంగూడా పెడతాడు! అదే రావుగారి తెలివి తేటలకొక పెద్ద దెబ్బ! రావుగారు ఎక్కడ కూర్చుంటే అక్కడ మాట్లాడుతూ నిద్రపోతాడు! అదీ బ్రహ్మాండమైన గురకతో. ఒకసారి రావుగారు బిజినెస్ పనిమీద కలకత్తా వెళ్ళవల్సి వచ్చింది.

స్వతహాగా డబ్బు ఖర్చు పెట్టని పిసినారిగనక తాను తీసుకెళ్ళిన పదివేల రూపాయల కట్టా పెట్టెలో పెడితే బస్సులో కొట్టేస్తారని భద్రంగా 'ప్యాంట్' జేబులో పెట్టుకుని కూర్చున్నాట్ట!... తను వెళ్ళాల్సిన చోటికి ఆ బస్సు చేరడానికి కనీసం గంటన్నా పడుతుందిట! అసలే ప్రయాణపు బడలికతో వున్న రావుగారు బస్సులో కూర్చోగానే చల్లటిగాలి తగలడంతో అలవాటు ప్రకారం మంచి కునుకు పట్టింది! ఎంతసేపైందో! కండక్టరువచ్చి లేపితే లేచి జేబు చూసుకున్నాట్ట! ఏముంది! పదివేలు!

ఆ కాసేపు నిద్ర ఖరీదు పదివేలు. ఈ విషయం మావారి చెవిన పడగానే అవసరమైతేనే నవ్వే మావారు ఆనందంతో కసికొద్దీ విరగబడి నవ్వారు! వాడికి మోకాల్లో వుంది బ్రెయిను అంటూ!

ఒకసారి మావారు ఏదో 'ఎక్విప్‌మెంట్' కొంటే తన సలహా లేకుండా మావారు అవతలవాళ్ళు చెప్పినంత ధరకి కొనేశాడనీ, తనుంటే వేరే కంపెనీది అంతకంటే చీప్ యాభేవేలు ఆదా చూసేవాణ్ణనీ, డబ్బు పోగొట్టుకోవడం తప్ప బిజినెస్ తెలీదు అంటూ మావార్ని చివాట్లేశాడు రావుగారు! కాని మావారు నలుగురు మంచి కంపెనీ అన్నచోటే కొన్నారు అది చాలా పెద్ద కంపెనీ బేరం చేస్తే బాగుండదురా ఫూల్ అన్నారు మావారు. నీకు బిజినెస్ తెలీదు పోరా ఫూల్ అన్నాడు రావుగారు! ఆ ఇద్దరి ఫూల్స్ సంభాషణ వింటూ వూరుకున్నాను!

ఇది జరిగిన వారంరోజుల్లోగానే రావుగారికి మరొక శృంగభంగం జరిగింది!

రావుగారు కొన్ని 'ఎక్విప్‌మెంట్స్' సినిమా షూటింగులకు అద్దెకిస్తుంటారు! వాడుకగా కంపెనీవాళ్ళు వచ్చి ఇంట్లో రావుగారి మేనేజర్‌తోనో లేక పి.ఎ.తోనో చెప్పి తీసుకెళ్తుంటారు. ఎక్విప్‌మెంట్ షూటింగ్‌కి రేపు ఫలానా 'ఎక్విప్‌మెంట్' కావాలని ఫలానా కంపెనీవాళ్ళు అడిగారు! రేపు పది గంటలకి వాళ్ళ మనిషి వస్తే పంపించెయ్యి అని చెప్పి వెళ్ళాట్ట!

రావుగారు చెప్పిన ప్రకారం ఆ ఫలానా కంపెనీ మనిషినని చెప్పి ఎవరో వచ్చి 'ఎక్విప్‌మెంట్' కావాలన్నాడు. రావుగారు చెప్పి వెళ్ళాడు గదా అని పనివాడు ఇచ్చేశాడు!

నాలుగు రోజుల తర్వాత రావుగారు వచ్చారు! అదే 'ఎక్విప్‌మెంట్'కోసం ఆ కంపెనీ వాళ్ళే ఫోన్ చేశారు కావాలని! ఆ ఎక్విప్‌మెంట్ వాళ్ళ దగ్గరే వుందనుకొన్న రావుగారు ఖంగుతిన్నారు! చివరకు తేలిన విషయం ఆ తీసుకెళ్ళినవాడు ఆ కంపెనీ వాడు కాదనీ, దొంగ అని!

ఒకటా రెండా! అది యాభైవేల రూపాయల ఖరీదుచేసే ఎక్విప్‌మెంట్!

అన్యాయంగా దొంగవెధవ తీసుకెళ్ళి పోయాడమ్మా! అని రావుగారు 'ఫోన్'లో నాతో చెప్తూంటే ఆ సంగతి విన్న మావారు మరొకసారి 'హా హా హా' అంటూ సినిమా 'విలన్'లాగా గట్టిగా నవ్వుతూ "అంతే కావాలి! నాకు బుర్ర లేదంటాడా! వీడి బుర్ర వాడి మోకాల్లో వుంది!" అంటూ ఫోన్ తీసుకుని రావుగార్ని మరికాస్త ఏడిపించారు!

ఆ తర్వాత ఒకరోజు ఫోన్ వస్తే మావారు స్నానం చేస్తూండడంవల్ల నేనే తీశాను! రావుగారు పాపం చాలా డల్‌గా మాట్లాడారు! ఎలా వుంది బిజినెస్! అని అడిగాను! ఆ అంతా ఒకే నష్టంగా వుందమ్మా! ఎవడో పాతికవేలు ఇవ్వాలి. పక్కింట్లోనే వున్నాడు ఇస్తా ఇస్తా అంటాడు మూడేళ్ళు దాటిపోయింది అన్నాడు. "నోటీసు ఇవ్వకపోయారా!" అన్నాను ఖంగారు పడుతూ! "ఆ అదే టైమ్ బారయిపోయింది!" అన్నాడు నవ్వుతూ — ఇది మావారు వింటే మరొకసారి హార్టీగా నవ్వుతారే! ఎందుకంటే ఎవరికో ఒకప్పుడు ఆపదలో మావారు ఆదుకొని ఇరవైవేల రూపాయలకి పూచీపడి హామీ పత్రం మీద సంతకం చేశారు! ఆ తీసుకున్నవాడు ఇవ్వకుండా మావారి దగ్గర కలెక్ట్ చేసుకోమన్నాడు! మావారు ఇచ్చి చేతులు కడుక్కున్నారు. ఇది విన్న రావుగారు ఫూల్‌లాగా నువ్వు సంతకం చేయడం ఏంటి! అని చివాట్లు వేయడం నే విన్నా! ఈరోజు పాతికవేలు రావుగారు పోగొట్టుకొన్నారు చేబదుల్లా ఇచ్చి!

టాపిక్ మార్చడానికి "అమ్మాయి, అల్లుడూ 'ఫారిన్' నుంచి వచ్చారు గదా అల్లుడుగారు ఇక్కడ ఏదైనా బిజినెస్ పెడ్తాడా!" అన్నాను. దానికి రావుగారు నవ్వుతూ "ఆ ప్రస్తుతం ఆయన బిజినెస్ విజయా హాస్పిటల్లో బెడ్‌లో వున్నాడు!" అన్నాడు అదే అలక్ష్య ధోరణిలో నవ్వుతూ! నాగుండె గతుక్కుమంది! 'ఏమైందండీ అల్లుడి కీ! అని ఖంగారు పడుతూ అడిగాను. మళ్ళీ అదే అలక్ష్య ధోరణిలో రావుగారు నవ్వుతూనే "అబ్బే ఏం లేదండీ మొన్న అతనికి స్కూటర్ యాక్సిడెంట్ అయ్యింది అన్నాడు! నాకింకా ఖంగారు పట్టుకుని" స్కూటర్ యాక్సిడెంటా! ఏమైంది రావుగారూ "అబ్బే ఏం కాలేదండీ, అతని చెయ్యి విరిగింది! అంతే" అన్నాడు నవ్వుతూనే! ఏం మనిషి! చెయ్యి విరిగిందని చెప్పి నవ్వుతాడేంటి! రావుగారు భలే తమాషా అయిన వ్యక్తి! అయితే అమ్మాయి ఎక్కడుంది! "హాస్పిటల్లో ఆయన దగ్గిరే వుంది!" అన్నాడు. నాదో చచ్చు ప్రశ్న అల్లుడికి దెబ్బతగిలితే కూతురెక్కడుంది అని అడగడమే ఒక అర్థంలేని ప్రశ్న! నేనలాంటి తెలివిలేని ప్రశ్న వేయడానికి కారణం రావుగారు అల్లుడి చెయ్యి విరిగిందని నవ్వడమే! నాకు మతిపోయినట్లయింది. ప్రపంచంలో ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు గాభరాపడుతూ అడగడం, ఖంగారుగా బదులు చెప్పడం సహజం. కాని రావుగారికి అన్నీ సమానమే.



మావారు వచ్చారు. ఈసారి రావుగార్ని "ఏరా ఫూల్. అల్లుడికి కారు ఇవ్వకుండా స్కూటరెందుకిచ్చావ్!"

అతనికి స్కూటరే అలవాటు! పైగా "నా కారు పాతికవేలు లాభానికమ్మేశాను మొన్ననే" అన్నాడు! అది విని మావారు విసుగుతో ఫోన్ పెట్టేస్తూ ఛాఛా! "పెన్నీ వైజ్ పౌండ్ ఫూలిష్" పన్లు చేస్తుంటాడు! పద హాస్పిటల్‌కెళ్ళి అల్లుణ్ణి చూసొద్దాం! అంటూ మావారు చొక్కా వేసుకోడానికి గదిలోకి వెళ్ళారు! ఆ ఇద్దరి స్నేహితుల మనస్తత్వాన్ని గురించి ఆలోచిస్తూ నిలబడ్డాను!

భానుమతీ రామకృష్ణ